BHARATH SAMACHAR DIGITAL

1, అక్టోబర్ 2026, గురువారం భారత్ సమాచార్

# మాక్ పార్లమెంట్‌లో అదరగొట్టిన నెల్లికుదురు విద్యార్థులు




**భారత్ సమాచార్, మహబూబాబాద్ జిల్లా:** జిల్లా కేంద్రం మహబూబాబాద్‌లోని ఐడీఓసీలో బుధవారం (సెప్టెంబర్ 30) నిర్వహించిన పీఎం శ్రీ పాఠశాలల జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో నెల్లికుదురు పీఎం శ్రీ తెలంగాణ రాష్ట్ర మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ఇద్దరు రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌కు ఎంపికయ్యారు.

జిల్లా నుంచి రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌కు మొత్తం ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో నెల్లికుదురు మోడల్ స్కూల్‌కు చెందిన ఎస్. దీక్షిత్, సిరివెన్నెల ఉన్నారు. జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్‌లో ఎస్. దీక్షిత్ ప్రధానమంత్రి పాత్రను, సిరివెన్నెల కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి పాత్రను సమర్థవంతంగా పోషించి ఆకట్టుకున్నారు.

## పాఠశాలకు గర్వకారణం

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు మాట్లాడుతూ.. జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి ఎంపికైన ఐదుగురు విద్యార్థుల్లో ఇద్దరు తమ పాఠశాలకు చెందిన వారు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలోనూ విద్యార్థులు ఇదే ప్రతిభను కొనసాగించి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## గైడ్ టీచర్ అంజుమ్ సుల్తానాకు అభినందన

జిల్లాస్థాయి మాక్ పార్లమెంట్‌లో విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించి, వారు అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలు ఎం.ఏ. అంజుమ్ సుల్తానాను ప్రిన్సిపాల్ జి. ఉపేందర్ రావు అభినందించారు. విద్యార్థుల ప్రతిభకు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో దోహదపడిందని తెలిపారు.

మాక్ పార్లమెంట్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై అవగాహన పెంచడంతో పాటు నాయకత్వ లక్షణాలు, చర్చా నైపుణ్యాలు, బాధ్యతాయుత పౌరసత్వ భావనను పెంపొందించేందుకు దోహదపడతాయని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి మాక్ పార్లమెంట్‌లో ఎంపికైన విద్యార్థులు మరింత ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మహబూబాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.